

సమాజ భాగస్వామ్యంతోనే దేశ ప్రగతి

కడప అర్బన్ : ప్రజలు చైతన్యవంతులై సమాజ అభివృద్ధిలో భాగస్వాములైనప్పుడే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జింక రంగ జనార్ధన్ ఉద్ఘాటించారు. 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో యువత భాగస్వామ్యం' అనే అంశంపై జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం, వసతి, సురక్షిత నీరు, విద్య అందినప్పుడే అభివృద్ధి మొదలవుతుందన్నారు. మూడు రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలను వాలంటీర్ల ద్వారా గ్రామీణులకు చేరువ చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ శిక్షణ ఫలాలు క్షేత్రస్థాయికి చేర్చాలని పిఒలకు సూచించారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ నరాల వెంకట్రామిరెడ్డి ఇషానిషేన్, నవ్య రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు.

వేతన వెతలు



ఆర్నెళ్లుగా ఎఫ్ఎన్ఒలకు తప్పని కష్టాలు
20 మంది ఎఫ్ఎన్ఒల్లో ఆకలి కేకలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా వైద్యఆరోగ్య శాఖ పరిధిలోని ఎఫ్ఎన్ఒలకు వేతన వెతలు తప్పడం లేదు. 2021 ఫిబ్రవరి 19న ఫ్యామిలీ హెల్త్ అండ్ డైరెక్టరేట్ విభాగం 78 పోస్టుల నోటిఫికేషన్ విడుదల చేసింది. గత ఏడాది జులై 26న కలెక్టర్ చైర్మన్‌గా డిఎంహెచ్ఒ ఆధ్వర్యంలో సెలెక్షన్ కమిటీ రూ.12 వేల వేతనం చొప్పున ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఆగస్టు ఒకటిన 60 పోస్టులను భర్తీ చేసింది. అనంతరం మిగిలిన 18 ఖాళీలకు ఫిమేల్ నర్సింగ్ పోస్టుల నియామకాలను చేపట్టింది. వీరందరూ ఏడాదిపాటు నర్సింగ్ సేవలు అందించాల్సి ఉంది. వైద్య ఆరోగ్యశాఖ ఇచ్చిన నిబంధనల మేరకు ఎఫ్ఎన్ఒలు విధుల్లో చేరిపోయారు. నెల రోజుల తరువాత నుంచి వేతనాల వెతలు అనుభవంలోకి రావడం పరిపాటిగా మారింది. నెల నుంచి ఆర్నెళ్లకుపైగా వేతనాలు రాకపోవడంతో ఉద్యోగుల్లో గందరగోళం నెలకొంది. డ్యూటీలో చేరినప్పటి నుంచి నేటి వరకు వేతనం ఎప్పుడు ఇస్తారో ఎవరికీ తెలియడం లేదు. ఆర్నెళ్లుగా అప్పులతో సవాసం చేస్తూ కాలం గడుపుతున్న ఉద్యోగులు నెలనెలా ఎదురు చూడాల్సి వస్తోంది. వీరికి వేతనాలు అందాలంటే జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సంతకం చేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. అనంతరం కలెక్టర్ సంతకం చేసిన అనంతరం వేతనాలు పడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్నెళ్లుగా రెండవసారి నియమితులైన 18 మంది ఎఫ్ఎన్ఒలు వడ్డీలకు అప్పులు తెచ్చుకుని ఇళ్లు గడుపుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. పిల్లల చదువులు, వృద్ధుల ఆరోగ్య ఖర్చులు భరించలేని వైనం ఇబ్బందులకు గురిచేస్తోందని వాపోతుండడం గమనార్హం. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో రిక్రూట్‌మెంట్, ఎఫ్ఎన్ఒగా విధుల నిర్వహణకు పర్యవేక్షిస్తున్న ఎఫ్ఎన్ఒల గురించి డిఎంహెచ్ఒ, ఔట్‌సోర్సింగ్ నిర్వాహకుల్లో ఎవరూ పట్టించుకోని నేపథ్యంలో తమ కుటుంబాల పరిస్థితేమిటని ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై డిఎంహెచ్ఒను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

సజావుగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

- జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్

ప్రజాశక్తి -కడప అర్బన్


మాట్లాడుతున్న డిఆర్ఒ గంగాధర్ గౌడ్

ఇంటర్ జనరల్, ఒకేషనల్ కోర్సులు చదివే విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షలను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించాలని డిఆర్ఒ గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సులకు సంబంధించి ఈ నెల 20 నుంచి మార్చి ఏడు వరకు, జనరల్ కోర్సులకు ఈనె నెల 26 నుండి మార్చి 7 వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 9 నుండి 12 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు రెండు పూటలా పరీక్షలను నిర్వహిస్తారన్నారు. జిల్లాలో మొత్తం 72 కేంద్రాల్లో జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు, 19 కేంద్రాలలో ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు సిద్ధం చేశామని చెప్పారు. ఆయా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలనీ పోలీస్, రెవెన్యూ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగు నీటిని ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు, అత్యవసర మందులతో పాటు ఒఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకుని ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారికి సూచించారు. పరీక్ష ప్రారంభానికి అర గంట ముందు నుంచి పరీక్ష పూర్తయ్యే వరకు విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్ష సమయాల్లో విద్యార్థులకు రవాణా వ్యవస్థ అనుకూలంగా ఉండేలా బస్సులను అన్ని రూట్లలో నడపాలని, పరీక్ష పూర్తి అయ్యాక బస్సు సౌకర్యం ఉండేలా చూడాలని ఆర్‌టిసి అధికారులకు ఆదేశించారు. ఆర్ఐఒ ఎస్.వి. రమణ రాజు మాట్లాడుతూ పరీక్షల కోసం మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ కేంద్రాలను పూర్తిగా మూసి వేయాలని. పరీక్షల నిర్వహణకు రెవెన్యూ, పోలీస్ అధికారుల సహకారం ఎంతైనా అవసరం అని, అందుకోసం సంబందిత శాఖల అధికారులు సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో పోలీసు, ఆర్‌టిసి, విద్యుత్ శాఖల అధికారులు పరీక్షల కమిటీ సభ్యులు ఎం.ప్రకాష్, సి.వి. సుబ్రమణ్యం, బి.వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న జడ్జి ఎస్. కవిత.

పిల్లల విద్య, ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత సూచించారు. శుక్రవారం కడప పట్టణం చిన్నచౌక్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, హాస్టల్‌ను ఆమె సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, హాస్టల్‌ను సందర్శించి వంటశాలను, వసతి, తరగతి గదులను పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015 వివరించారు. పిల్లలు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలి అని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మధ్యాహ్న సమయంలో వారికి అందుకున్న భోజనం సదుపాయాలను పరిశీలించారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. పిల్లల విద్యా, ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదేశించారు. విద్య విలువైందని, క్రమశిక్షణతో అభ్యసించాలి అని అన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ వారి సహకారంతో పిల్లలకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో రామాలయ ధర్మకర్త వెంకట్ రెడ్డి, బాసట స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బాలాజీ, వార్డెన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

దర్గా నూతన కమిటీ ఏర్పాటు చేసినప్పటి నుంచి తమపై పాత కమిటీ సభ్యులు లేనిపోని ఆరోపణలు చేయడం తగదని నూతన కమిటీ కార్యదర్శి ఇస్మాయిల్, సభ్యులు అన్వర్ అన్నారు. శుక్రవారం దర్గా సమీపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్ల నుంచి పాత కమిటీ ఎలాంటి అభివృద్ధి చేయలేదని పేర్కొన్నారు. రామకృష్ణ గ్రౌండ్ స్థలానికి సంబధించి రఖేబ్ షా వలి దర్గా దగ్గర ఎలాంటి డాక్యుమెంట్లు లేవన్నారు. దర్గా ఉరుసు ఉత్సవాల కోసం ఒక ఎకరా భూమిని రామకృష్ణ వారు కేటాయించారని పేర్కొన్నారు. తమపైన చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు. డబ్బులు తీసుకుని కొత్త కమిటీ పని చేస్తుందని అనడం బాధాకరమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. స్థలానికి సంబంధించి ఏవైనా ఆధారాలు ఉంటే పోరాడాలే తప్ప తమపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని తెలిపారు.

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-చెన్నూరు

మండలంలోని శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. చెన్నూరులోని నాగేశ్వరుని ఆలయం, పెన్నా వద్దగల శివాలయం, శివాలపల్లె వద్ద గల కాశీ విశ్వేశ్వర ఆలయంలో, కైలాసగిరి కోన వద్ద గల శివాలయంలో, కొండపేట గ్రామంలోని శివాలయంలో, ఉప్పరపల్లె గ్రామ వద్ద గల నాగేశ్వరుని ఆలయంలో, శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు, కాశీ విశ్వేశ్వరుని ఆలయంలో శివపార్వతుల కల్యాణం ఉదయం 10 గంటల నుంచి అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం అనంతరం కోలాటం, చెక్కభజన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు

టిడిపి జిల్లా సమన్వయ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి అధ్యక్షతన జిల్లా సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీలు బిటెక్ రవి, శివనాథ రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి, ప్రొద్దుటూరు ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి, రాయచోటి ఇన్‌ఛార్జి రమేష్ కుమార్ రెడ్డి, బద్వేల్ బాధ్యులు రితేష్ కుమార్ రెడ్డి, పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్ రెడ్డి, హరిప్రసాద్, బచ్చల పుల్లయ్య, ముక్తియార్, రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, మాజీ టిటిడి బోర్డు సభ్యులు ప్రసాద్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరి హాజరయ్యారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ పై చర్చించారు.

కార్యకర్తలకు దిశానిర్దేశం

కడప : కడప నియోజకవర్గం బిల్డప్ సర్కిల్ వద్దనున్న వెంకట సాయి కళ్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు 'మా నమ్మకం నువ్వే జగనన్న 'పై నాయకులకు, కార్యకర్తలకు డిప్యూటీ సిఎం అంజాద్‌బాష, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ దిశానిర్దేశం చేశారు. కార్పొరేటర్లు రెడ్డి ప్రసాద్, జమాల్ వల్లి, రామ్ మోహన్ ,బాలస్వామి రెడ్డి, చల్లా రాజశేఖర్, శ్రీనివాసులు, గృహసారథులు, కన్వీనర్లకు నిర్వహించిన కార్యక్రమంలో పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు సుబ్బారెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాకా సురేష్, షఫీ, కన్వీనర్లు, వాలంటీర్లు, గృహ సారదులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగయ్య,పార్టీ నాయకులు కాల్ టెక్స్ హాఫిజుల్లా,పెద్దిరెడ్డి రామ్ మోహన్ రెడ్డి, తోట కృష్ణ, మనోజ్, మహిళా నాయకులు ,పార్టీ ముఖ్య నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

కాల్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కడప

24 గంటలూ అందుబాటులో ఉండే 1950 టోల్ ఫ్రీ నంబర్ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంభందించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన తదితర విషయాలతో పాటు, సాధారణ సమస్యలను పై టోల్‌ఫ్రీ నంబర్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ఆర్‌జెడి దిగజారుడు సిగ్గు చేటు

- అప్పర్ భద్రపై సిఎం స్పందించకపోవడం దుర్మార్గం
- 25న కడపకు చంద్రబాబు రాక
- మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

ఆర్‌జెడి స్థాయిలో ప్రతాప్‌రెడ్డి ఇంత దిగజారుడు తనానికి పాల్పడ్డం సిగ్గుచేటని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు దగ్గర ఉండి మరీ దొంగ ఓట్లు ఎక్కించడం బాధాకర మన్నారు. ప్రయివేట్ పాఠశాలు కళాశాలల ఉపాధ్యాయులకు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించడంతో బోగస్ ఓట్లకు అధికార పార్టీ తెరలైపోయిందని విమర్శిం చారు. ఆర్‌జెడి విచ్చలవిడిగా వ్యహరిస్తున్నారని పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఆలోచించి టిడిపి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అప్పర్ భద్రత సిఎం సొంత జిల్లాకు నష్టం జరుగుతున్నా స్పందించ కపోవడం దుర్మార్గమన్నారు. ఆస్తులను కాపాడు కోవడానికి, వివేక హత్య కేసు కోసం ఢిల్లీ ప్రదక్షిణలు చేయడం జగన్‌కు సరిపో తుందన్నారు. మహారాష్ట్ర బాబ్లీ వద్ద ప్రాజెక్టు ఎత్తు పెంచుతూ ఉంటే చంద్రబాబు నాయుడు అడ్డుకున్నారని అక్కడి పోలీసులు అరెస్టు కూడా చేశారని గుర్తు చేశారు. జగన్‌కు ఇంతమంది ఎంపీలు ఉండి కర్ణాటక తీరుపై ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అభివృద్ధిపై సవాళ్లు విసిరిన వైసిపీ నాయకులు చర్చకు రాకుండా టిడిపి నాయకులను అరెస్టు చేయించడం సిగ్గుచేటు అన్నారు. వైసిపి ప్రభుత్వం లోకేష్ పాదయాత్రను అడ్డుకోవడం, టిడిపి నాయకులను ఇబ్బంది పెట్టడం లక్ష్యంగా పనిచేస్తున్నారని విమ ర్శించారు. 40 శాతం మంది పోలీసులు ప్రజలకు భక్షకులుగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో నేరాలు పెరిగిపోయాయని, టిడిపి పాలనలో, వైసిపి నాలుగు వేళ్ళలో ఎన్ని క్రిమినల్ కేసులు నమోదయాయో డీజీపీ వైట్ పేపర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు

25న చంద్రబాబు రాక

కడప జోన్ పరిధిలోని కడప, హిందూపూర్, అనంతపురం, కర్నూల్, నంద్యాల జిల్లాల నాయకులతో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు కడపలో సమావేశం కానున్నారని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనకు చరమగీతం పాడేందుకు పట్టపద్రులు, ఉపాధ్యాయులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. టిడిపి పోలిట్ బ్యూరో శ్రీనివాస రెడ్డి, జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి మాట్లాడుతూ సజ్జల రామకృష్ణారెడ్డి దర్గా స్థలాన్ని ఆక్రమించి ప్రహరీని నిర్మించడం దుర్మార్గమన్నారు. అమీర్ బాబు తో పాటు మైనార్టీ నాయకులను అరెస్టు చేయడం ఏమిటన్నారు. స్టేటస్కో ఉన్న నిర్మాణ పనులు చేయడం వైసిపి నాయకులకే చెల్లిందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ బీటెక్ రవి, ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు హరిప్రసాద్ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

ప్రతాప్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఆర్‌జెడి ప్రతాప్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలి ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు సగిలి రాజేంద్ర ప్రసాద్, వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతాప్ రెడ్డి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, టీచర్ ఎంఎల్‌సి ఎన్నికలలో అధికార పార్టీకి చెందిన అభ్యర్థులను గెలిపించేందుకు అడ్డదారులు తొక్కుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే కడప, కర్నూల్, అనంతపురం ఉమ్మడి జిల్లాలలో రహస్య సమావేశాలు, మంతనాలు నిర్వహించారని చెప్పారు. ఒకవైపి ఆర్‌జెడి సతీమణి, ఎంఎల్‌సి కల్పలతారెడ్డి కూడా కస్తూరిబా గాంధీ సిబ్బందితో సమావేశాలు నిర్వహిస్తూ అధికార పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం పనిచేస్తున్నారని చెప్పారు. అధికార పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం ప్రతాప్ రెడ్డి, ప్రయివేట్ స్కూల్ యాజమాన్యంతో కుమ్మక్కై అత్యధికంగా దొంగ ఓట్లు ఎక్కించారని చెప్పారు. ఈ విషయమై ఇప్పటికే ఎన్నికల కమిషన్ కూడా వివరణ కోరిందన్నారు. డిఇఒలు పట్టీ పట్టనట్లుగా వ్యవహరించడం శోచనీయమన్నారు. .అనంతపురంలో ప్రభుత్వ ఉపాధ్యాయులతో ఎన్నికల రహస్య సమావేశం నిర్వహిస్తుంటే విద్యార్థి, యువజన సంఘాలు అడ్డుకున్నాయన్నారు. కానీ విద్యార్థి, యువజన సంఘం నాయకులను అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందని వాపోయారు. కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఎన్నికలను సజావుగా నడిపించాలని, అక్రమాలకు పాల్పడిన అధికారుల పై చర్యలు తీసుకోవాలని, అలా జరగాలంటే ప్రతాప్ రెడ్డిని సస్పెండ్ చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సునీల్, జిల్లా సహాయ కార్యదర్శి వినయ్ కుమార్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు, తులసిశ్వర్ పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం


కడప అర్బన్ : నగరంలో ఒక ప్రయివేట్ నర్సింగ్ కళాశాలలో బిఎస్‌సి నర్సింగ్ చదువుతున్న చింతమాను మౌనిక అనే విద్యార్థికి వివేకానంద ఫౌండేషన్ సంస్థ బాసటగా నిలిచింది. వీరపునాయునిపల్లె మండలంలోని అనిమెల గ్రామానికి చెందిన మౌనికకు తండ్రి లేడు. తల్లి సుబ్బమ్మ కూలీ చేసుకుంట కుమార్తెను చదివిస్తోంది. కూతురి చదువుకు ఆర్థిక సాయం అందించాలని వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డిని తల్లి కోరారు. ఈ మేరకు శుక్రవారం కళాశాలకు వెళ్లి ఈ ఏడాది ఫీజు రూ. 21 వేల చెక్కు రూపంలో మౌనిక కు అందించి భరోసా కల్పించారు. మౌనిక, ఆమె తల్లి సాయం పొందిన సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

పోరుమామిళ్ల టౌన్ : మండలంలోని టేకూరుపేట, కవలకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న బాల బాలికలు 643 మందికి స్థానిక ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్. గీత, తోమాస్ రెడ్డి దంపతులు శుక్రవారం ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు. వీటిని సంస్థ ప్రతినిధులు ఎల్. ప్రసాద్ రెడ్డి, జి. శ్రీకాంత్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా ఎఫ్.సి. ఎన్. ద్వారా చేసే సేవచేస్తూనే ఉన్నామని చెప్పారు. విద్యార్థులు బాగా చదువు కొని సర్వతోముఖాభివృద్ధి చెందాలని సంస్థ వ్యవస్థాపకులు కోరుతున్నట్లు తెలిపారు కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, హాజరై సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా తాహిర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్


మొక్కలు నాటిన తాహిర్, సమితి సభ్యులు

జన వికాస్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.ఎం.డి. తాహిర్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సేవా సమితి రాష్ట్ర కన్వీనర్ మన్సూర్ అలీ ఖాన్,రాష్ట్ర సలహాదారులు నూనె నాగేష్, పీవీ రమణ, డాక్టర్ శ్రీనివాసులు, కార్యదర్శి యునుస్ బాషా ఆధ్వర్యంలో నగరంలోని వృద్ధ ఆశ్రమాలలో, అనాథ పిల్లల వసతి గృహాలలో అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. బృహదా బ్లడ్ బ్యాంక్‌లో పలువురు రక్తదానం చేశారు. నగరంలోని వృద్ధ ఆశ్రమాలలో, నిరాశ్రయుల వసతి గృహాలలో, ఆశ నిలయం, మూగ చెవిటి వసతిగృహంలో మానసిక వికలాంగుల కేంద్రంలో, రోడ్లపై ఉన్న నిరాశ్రయులకు అన్నదానం చేశారు. వస్త్ర, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పోలీస్ స్పోర్ట్స్ గ్రౌండ్ లో తాహిర్ ప్రీమియర్ లీగ్ సెషన్ -3 క్రికెట్ ట్రోఫీ నిర్వహించారు. కార్యక్రమంలో జన వికాస్ ప్రతినిధులు తాజుద్దీన్, డాక్టర్ శ్రీనివాసులు, సీఎస్ నాసిర్ అలీ,అబ్దుల్ వాజిద్, వాలేపు శివ,స్ఫూర్తి ఎ హోప్ ఫౌండర్ వెంకటేష్, షేర్ హెల్ప్ టీమ్ ఫౌండర్ అలిషేర్, ఖూన్ కా రిష్తా అధ్యక్షుడు తారిఖ్ అలీ, లక్ష్మీ నరసింహా పాల్గొన్నారు.

40వ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలి

కడప అర్బన్ : నగర పరిధిలోని మరియాపురంలో ఉన్న ఎస్‌టి జోసెఫ్ పాఠశాల 40వ వార్షికోత్సవం ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ ఫాదర్ పి దేవదాసు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా రెవరెండ్ .గాలి బాలి, డీఈవో దేవరాజ్, ఫాదర్ అబ్రహం హాజరవుతారని పేర్కొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులు శ్రేయోభిలాషులు హాజరై జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

ఏప్రిల్ నుంచి దశలవారీగా ఉద్యమం

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆస్కార్‌రావు

ప్రజాశక్తి-రాయచోటి

ఉద్యోగ సమస్యలు పరిష్కారం కాకుంటే ఏప్రిల్ నుండి దశలవారీగా ఉద్యమిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌రావు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉద్యోగుల కార్యాలయంలో జిల్లా స్థాయి ఉద్యోగుల సమావేశం జిల్లా అధ్యక్షుడు వై.శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆస్కార్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు బకాయిపడ్డ ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో చెల్లించకపోవడం, ఉద్యోగుల జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ సేవింగ్స్ ఖాతాల నుండి రుణాలు విడుదల చేయకపోవడం, జీతాలు సకాలంలో పడకపోవడం, పిఆర్‌సి సమస్యలు పరిష్కారం చేయకపోవడం పట్ల ఉద్యోగులలో వ్యతిరేకత తీవ్రంగా ఉన్నదని తక్షణం ప్రభుత్వం స్పందించాలని విన్నపం చేశారు. ప్రభుత్వ ఉద్యోగ, పెన్షనర్లకు 1వ తేదీనే జీతాలు చెల్లింపు చేయాలని, 11వ పిఆర్‌సి ద్వారా రావలసిన ఆర్థిక ప్రయోజనాల బకాయిల చెల్లింపుల షెడ్యూల్ ప్రకటించాలన్నారు. ఉద్యోగుల జిపిఎఫ్ ఖాతాల నుండి అనుమతి లేకుండా విత్ డ్రా చేసిన రూ.480 కోట్లను తిరిగి చెల్లింపు చేస్తారో చెప్పాలన్నారు. ఉద్యోగులకు రావలసిన సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ విధిగా ప్రతి ఏటా నిర్దిష్ట కాలపరిమితిలోగా చెల్లించాలన్నారు. ఉద్యోగులకు చెందాల్సిన ఎల్‌టిసి హోమ్ టౌన్ సదుపాయాలను నిర్దిష్ట కాలపరిమితి అనుమతించాలి. ఉద్యోగులకు రావలసిన టూరు సమయంలో టిఎ, డిఎ, ఎఫ్‌టిఎలు నిర్ణీత కాలపరిమితి విధించి చెల్లించాలిన్నారు. ఉద్యోగుల కొన్ని శాఖల ఉద్యోగులు అద్దె భవనాలతో స్వంత ఖర్చులతో కార్యాలయాలను నిర్వహిస్తునందున (వైద్య, ఆరోగ్య శాఖలో ఎఎస్ఎంలు ఉపకేంద్రాల నిర్వహణ, సెక్టారు కార్యాలయాల నిర్వహణ) వాటిని మంజూరుచేసి నిర్దిష్ట కాలపమితిలోగా చెల్లిస్తారో తెలియచేయాలని పేర్కొన్నారు. నిర్దిష్ట కాలపరిమితిలోగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపు సకాలంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌రాజు, కార్యదర్శి ఎస్.బాబా సాహెబ్, కృష్ణా జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ బాబు, విశాఖ జిల్లా కార్యదర్శి రవి శంకర్, జిల్లా కార్యదర్శి గురుప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలాజీ, జిల్లా కోశాధికారి సుధాకర్ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డినాయక్, వివేకానంద, రెవెన్యూ సంఘం అధ్యక్షులు రమేష్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్ట్మెంట్ రమేష్, కృష్ణవేణి, తాలూకా అధ్యక్షులు సాయి కుమార్, కార్యదర్శి సుజిత్, శ్రీనివాసులు నాయక్, సదాశివారెడ్డి, వలి, కవిత, సావిత్రి, హౌస్ బిల్డింగ్ డైరెక్టర్ సిద్దయ్య, రాజా కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ స్టేట్ కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి, జిల్లాలోని తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

'నిహార్'లో విదేశీ ప్రతినిధులు

ప్రజాశక్తి-కడప అర్బన్


శిక్షణ పొందుతున్న వారితో విదేశీ ప్రతినిధులు

యునైటెడ్ కింగ్డమ్ నేషనల్ హెల్త్ సర్వీసెస్ ప్రతినిధులు మిస్సెస్ లూయిస్,రిచర్డ్ మెక్డోనాల్డ్, నేషనల్ హెల్త్ సర్వీస్ ఇండియా ప్రతినిధి రాధ రెడ్డి శుక్రవారం నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థను సందర్శించారు. ఇందులో శిక్షణ పొందుతున్న ట్రైనీస్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌కు అధునాతన మెలుకువలు తెలిపారు. కోర్సుకు రాబోవుకాలం ప్రపంచ వ్యాప్తి ఉద్యోగ అవకాశాలు ఎక్కుగా ఉంటాయని పేర్కొన్నారు. శిక్షణ పట్ల సంతృప్తి తెలియజేస్తూ ఇటువంటి కోర్సులను మరింత పోత్సహించాలని సంస్థ యాజమాన్ని కోరారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో డిడియుజికెవై పథకం సీడప్ సౌజన్యంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ శిక్షణ సంస్థలో వారు ఇటువంటి కోర్సులను ప్రోత్సహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 108 సిబ్బంది అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ ప్రతినిధి పరశురాం, మహిపాల్, ఈశ్వర్, నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని చీకటిలోకి నెట్టిన వైసిపి

వల్లూరు : వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని చీకటిలోకి నెట్టి చోద్యం చూస్తోం దని టిడిపి మండల అధ్యక్షుడు లేబాక నాగేశ్వర్ రెడ్డి అన్నారు. మూడు న్నరేళ్ల పాలనలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు నిత్యావసర ధరలను అమాంతంగా పెంచడంతో ప్రజలు ఇదేం కర్మ అంటూ ప్రశ్నిస్తున్నారని శుక్రవారం మండలంలోని పైడి కాలువలో రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు సంక్షేమ ప్రభుత్వమని చెప్పుకుంటున్న జగన్ సర్కారు రైతుల నుంచి నేటి వరకు ధాన్యం కొనుగోలు చేసే పరిస్థితి లేదన్నారు. పండించే పంటలకు కూడా కనీసం మద్దతు ధర లేదన్నారు. ఏ రకంగా చూసినా రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ప్రజల కష్టాలు తీరాలంటే టిడిపిని గెలిపించాలని కోరారు. అనంతరం. ప్రజలతో కలిసి ఇదేం కర్మ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు టి. రాఘవరెడ్డి, ఎల్ఎన్ఆర్, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, వీరారెడ్డి, రామకృష్ణారెడ్డి, సుమంత్, గండి రవి ఎర్ర గుండు సుబ్బారెడ్డి, కేశవరెడ్డి, హరికృష్ణ, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



నూర్పిడికి సిద్ధంగా ఉన్న పసుపు పంట

పసుపు పంట నూర్పిడికి సన్నద్ధం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో పసుపు సాగు చేసిన రైతులు నూర్పిడికి సిద్ధపడుతున్నారు. ప్రస్తుతం పసుపు ఆకులను తొలగించే పనులు చేస్తున్నారు. తర్వాత దుక్కిళ్ళ చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. ఫిబ్రవరి చివరి వారంలో నూర్పిడి చేపట్టాలని భావిస్తున్నారు. మండల వ్యాప్తంగా 400 ఎకరాలలో రైతులు పసుపు పంటను సాగు చేశారు. పంట నూర్పిడి చేసి వట్టి పసుపుగా మార్చి అమ్ముకాలు చేపడతారు. మైదుకూరు, దువ్వూరు ప్రాంతాల్లో మాత్రం ఆలస్యంగా నూర్పిడి చేసి విత్తనపు పసుపుగా అమ్ముకాలు చేపడతారు. పంట దిగుబడి ఆశాజనకంగా ఉండవచ్చని రైతులు భావిస్తున్నారు. తెగుళ్ళు చాలా వరకు తగ్గాయని, అధిక వర్షాలకు పసుపుకొమ్ములు దెబ్బతిని ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పసుపు పంట ధరలు మాత్రం చాలా అధ్వానంగా ఉన్నాయని సరైన గిట్టుబాటు ధర కల్పిస్తే ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం సీతారామపురం, చాపాడు గ్రామాల వద్ద పసుపు ఆకు తొలగిస్తూ రైతులు నూర్పిడి పనులకు సిద్ధమవుతున్నారు.

రేపు అల్లాడుపల్లెలో బండలాగుడు పోటీలు

చాపాడు : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 19న వృషభరాజములచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ చీటి వెంకటసుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు, సర్పంచ్ కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. బండలాగుడు పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎద్దులకు అల్లాడుపల్లె గ్రామానికి చెందిన వీర నారాయణయాదవ్ రూ.100116లు బహుమతిగా అందజేయనున్నారు. ద్వితీయ బహుమతిని లక్ష్మీ పేట కర్నాటి నారాయణరెడ్డి రూ. 70 116 లు, అల్లాడుపల్లె రఇకుల సంఘం వారు రూ. 60116, నాలుగో బహుమతిని ,వెన్నూరు జువెలర్స్ వారు రూ. 40116, 5వ బహుమతి ఎంపీటీ టి లక్ష్మమ్మ రూ. 20116, 6వ బహుమతిని నరసాపురం గ్రామానికి చెందిన పి.చిన్న వీరారెడ్డి కుటుంబ సభ్యులు రూ.12116 ,7వ బహుమతిని కోడూరు వెంకట శివ కుటుంబ సభ్యులు రూ. 5116 అందజేయనున్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎస్ రఘురామి రెడ్డి హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పాల్గొను వృషభరాజములు యజమానులు 19న ఉదయం 11 గంటలలోపు కమిటీ సభ్యులకు తమ పేర్లు తెలియజేయాలని వారు కోరారు.



మాట్లాడుతున్న అనుడ వైస్ చైర్మన్ నందన్

'ఆన్‌లైన్ బిల్డింగ్ ప్లాన్'పై అవగాహన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోని జమ్మల మడుగు రెవెన్యూ డివిజన్ సంబంధిత పంచాయతీ కార్యదర్శులతో పంచాయతీలలో ఆన్‌లైన్ బిల్డింగ్ ప్లాన్ అనుమతి ప్రక్రియపై అవగాహన సదస్సు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వైస్ చైర్మన్ నందన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. పంచాయతీలలో 300 చదరపు కిలో మీటర్ల కంటే తక్కువ వైశాల్యం ఉన్న బిల్డింగ్ ప్లాన్ అనుమతి ప్రక్రియను సంబంధించి ఎంట్రోప్యూర్స్ వారిచే అభివృద్ధి చేయబడ్డ వెబ్ అప్లికేషన్‌పై పంచాయతీ కార్యదర్శులకు కల్పించారు. భవన నిర్మాణ ఆమోద ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో తీసుకురావడంతో పారదర్శకత పెరుగుతుందని చెప్పారు. అనుమతి తీసుకునే ప్రక్రియ సులభతరం అవుతుందన్నారు. పంచాయతీల్లో అక్రమ నిర్మాణాలు, అనధికార లేఅవుట్లపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్లానింగ్ ఆఫీసర్ పి.శైలజ, ఎపిఒ ఆసిఫ్, ఎపిఒ కృష్ణసింగ్, డిఎల్‌పిఒ మీరా, ఎంపిడిఒ, ఇఒ పాల్గొన్నారు.

ఆస్తి కోసమే రోడ్డు పాల్జేశారు : ఐద్వా

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

అమ్మకు మాయమాటలు చెప్పి ఉన్న ఆస్తిని కాజేసి, కని, పెంచిన అమ్మను ఆమె కుమారులు రోడ్డు పాల్జేశారని ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్‌బేగం పేర్కొన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో



మాట్లాడుతున్న ముంతాజ్,పక్కన బాధితురాలు పద్మావతి

శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. బాధితురాలు పద్మావతి భర్త బంగారునాని చెప్పు గత కరోనా సమయంలో మృతి చెందినట్లు తెలిపారు. తండ్రి మృతి అనంతరం ఆస్తికోసం ఆమె ఇద్దరు కుమారులు మాయమాటలతో సంతకాలు చేయించుకొని ఆస్తిని కాజేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. న్యాయం కోసం జనవరి 30న ఎస్‌పిని కలిశారని అన్నారు. ఎస్‌పి ఆదేశాల మేరకు స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ అధికారులను కలవగా ఆమె కుమారులతో పోలీస్ అధికారులు మిలాఖత్ అయ్యి ఆమెను పట్టించుకోవడంలేదని వాపోయారు. బాధితురాలికి న్యాయం జరక్కపోతే ఈనెల 21న వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తామని, అక్కడికీ పోలీసులు స్పందించకపోతే 22న కడప ఎస్‌పి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని ముంతాజ్ తెలిపారు. అనంతరం బాధితురాలు పద్మావతి మాట్లాడుతూ తన భర్త మృతి అనంతరం తన కుమారులు సురేంద్ర, నాగభూషేంద్ర తనను నమ్మించి సంతకాలు చేయించుకున్నారని చెప్పారు. సుమారు రూ. 12 కోట్ల ఆస్తిని వారిపేరుపై రాయించుకుని, తనను రోడ్డు పాల్జేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా అనేక కష్టాలు ఎదుర్కొం టున్నానని చెప్పారు. ఎస్‌పికి ఆదేశాల మేరకు ఈనెల 2న స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే న్యాయం చేస్తామని పోలీసులు చెప్పి తరువాత రోజు నుంచి మాట మార్చారని వాపోయారు. ఎస్‌ఐ మంజునాథ్‌ను కలవగా 'నేనేం చేయాలమ్మ మీరే మాట్లాడుకోండి' అని అన్నారని తెలిపారు. సిఐ కూడ ఇదే సమాధానం చెప్పారన్నారు. ఒంటరిదాన్నైన తనకు అధికారులు న్యాయం చేయాలని లేనిపక్షంలో ఆత్మహత్య శరణ్యం అని వాపోయారు. సమావేశంలో ఐద్వా పట్టణ అధ్యక్షులు సరేశ్వరి, ఉపాధ్యక్షులు రామలక్ష్మ, కార్యదర్శి వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు మరింత చేరువ

జమ్మలమడుగు రూరల్ : దేశంలోని ప్రతిగ్రామానికీ బ్యాంకు సేవలు మరింత దగ్గర చేర్చడమే ఎస్‌బిఐ ప్రధాన ఉద్దేశమని డిప్యూటీ అగ్రికల్చర్ జనరల్ మేనేజర్ సాయి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గూడెంచెరువు గ్రామంలో ఎస్‌బిఐ ఆధ్వర్యంలో రాత్రి శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్‌బిఐ శాఖ పరిధిలోని ప్రతి రైతుకూ సులభతరంలో రుణాలు మంజూరు చేయడంతోపాటు ఆవసరమైన పరికరాలను రుణం ద్వారా అందిస్తామన్నారు. ముందుగా చేనేత కార్మికుల, డ్రోన్, వ్యవసాయ ఆధారిత పరికరాలను ప్రారంభించారు. అనంతరం ప్రగతిశీల రైతులు నాగేంద్రుడు, శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ నారాయణరావు, జమ్మలమడుగు ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ కృష్ణ నాయక్, సర్పంచ్ మజిరి నాగేశ్వర్, టౌన్ బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్, ఫీల్డ్ ఆఫీసర్ ఎలమండరెడ్డి పాల్గొన్నారు.

యజమాన్య పద్ధతులు పాటించాలి

లింగాల : ఆరటిపంట సాగు చేసే రైతులు యజమాన్య పద్ధతులు పాటించాలని అరటి పరిశోధన శాస్త్రవేత్త దత్త రెడ్డి, సునీల్ కుమార్ తెలిపారు. మండలంలోని కోమన్నూతల తాతిరెడ్డిపల్లెలో రైతులు సాగు చేస్తున్న అరటి పంటను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరటిపంట తెగులలో అధికారులు సూచించిన ప్రకారం మందులు ఎరువులు ఉపయోగిస్తే అధిక దిగుబడులు పొందవచ్చు అన్నారు

భవనాల తొలగింపు పనులు వేగవంతం

వేంపల్లెలో రూ.73 కోట్లతో రహదారుల విస్తరణ

ప్రజాశక్తి - వేంపల్లె



సిఎం నియోజకవర్గంలోని అయిదు మండలాలకు కూడలిగా ఉన్న వేంపల్లెలోని పులివెందుల, కడప, గండి ప్రధానరోడ్ల విస్తరణకు రంగం సిద్ధం అయ్యింది. వేంపల్లెలోని హనుమాన్ జంక్షన్ నుంచి పట్టణం మీదుగా పులివెందుల రోడ్డులోని ఎన్టీఆర్ కూడలి వరకు, గండిరోడ్డులోని ఆర్చి వద్ద నుంచి రాజారెడ్డి నగర్ వద్ద నున్న పెట్రోలు బంకు వరకు ట్రాఫిక్ సమస్య జఠిలంగా ఉంది. ఇరుకు దారుల్లో రాకపోకలు సాగించడానికి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజూ ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 10 గంటల వరకు ప్రత్యేకించి నాలుగురోడ్ల కూడలి, గండి రోడ్డులో వందల వాహనాలు తిరుగు తుంటాయి. ట్రాఫిక్ సమస్య నిర్మూలిం చేందుకు సిఎం జగన్ మోహన్ రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి దృష్టికి జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు తీసుకెళ్లారు. స్పందించిన ముఖ్యమంత్రి వేంపల్లెలో ట్రాఫిక్ సమస్య లేకుండా ఉండేందుకు రోడ్లు విస్తరణ చేసేందుకు రూ.73 కోట్లు మంజూరుచేశారు. ఈ మార్గాలను 72 అడుగుల మేరకు విస్తరించి మధ్యలో డివైడర్, సెంటర్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసేందుకు రోడ్డు భవనాల శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. రోడ్డు భవనాల శాఖ అధికారులు ఇచ్చిన మార్కింగ్ ప్రకారం స్థలాలు, భవనాలు కోల్పోయిన బాధితులకు రెండు విడతలుగా ప్రభుత్వం రూ 40 కోట్లు మంజూరు చేసింది. పరిహారం వచ్చిన బాధితులు అందరూ అధికారులు ఇచ్చిన మార్కింగ్ ప్రకారం భవనాలను తొలగించి యుద్ధప్రాతిపదికన పనులు చకచకా చేస్తున్నారు. రోడ్లు, భవనాలు శాఖ అధికారులు మార్కింగ్ ఇచ్చిన మేరకు భవనాలను తొలగించాలని లేని పక్షంలో యంత్రాలతో తొలగిస్తామని అధికారులు అంటున్నారు. ఈ మేరకు ప్రభుత్వాస్పత్రి, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, పంచాయతీ రాజ్ ప్రహరీలను తొలగించారు. వృషభాచలేశ్వర దేవస్థానం దుకాణ సముదాయం, జడ్‌పి దుకాణ సముదాయాన్ని, ఎస్సీ కార్పొరేషన్ వాణిజ్య గదులను యంత్రాలతో తొలగించారు. నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న మసీదు వాణిజ్య గదులను కూడా తొలగించారు. త్వరితగతిన రోడ్ల విస్తరణ పనులు చేపడితే ట్రాఫిక్ సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్తు స్తంభాలను పక్కకు మార్చి రోడ్డు విస్తరణ పనులు చేపడుతామని రోడ్లు, భవనాలశాఖ అధికారులు అంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇంటి యజమానులు కూడా త్వరితగతిన పనులు పూర్తి చేసుకుని సహకరించాలని కోరుతున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు

శనగ పంట రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని జమ్మలమడుగు రెవెన్యూ డివిజనల్ అధికారి జి. శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలో డిసిఎంఎస్ (డిస్ట్రిబ్యూటర్స్ సెంటర్ మేనేజ్మెంట్ సిస్టం) కేంద్రాలను జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం, ముద్దనూరు, కొండాపురం, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, రాజుపాలెం, చాపాడు, దువ్వూరులలో శనగ పంట సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాలలో ప్రభుత్వం నిర్ణయించిన, నాణ్యత ప్రమాణాల మేరకు ధర చెల్లిస్తారని చెప్పారు. రైతులు దళారులను ఆశ్రయించరాదని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేసుకున్న రైతులందరికీ విక్రయించాల్సిన పరిమాణం, తేదీలను మొబైల్ ఫోన్ ద్వారా సమాచారం అందజేస్తామన్నారు. సేకరించిన ధాన్యానికి డబ్బు నేరుగా రైతు ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. రైతుల పేరుపై దళారులు ప్రభుత్వానికి అమ్మడం, నిల్వ చేసుకోవడానికి సహకరించరాదని చెప్పారు. దళారులు ఇచ్చే రేటు కంటే ప్రభుత్వం అధిక రేటు ఇస్తుందన్నారు. రైతులను మభ్యపెట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనగ ధాన్యం సేకరణ విషయమై సంబధిత మండల వ్యవసాయ, రెవెన్యూ , మార్క్ ఫెడ్ అధికారులను సంప్రదించాలన్నారు.

బస్టాండ్ల ప్రయివేటీకరణను ప్రతిఘటిస్తాం



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు శివ నారాయణ

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా ఆర్‌టిసి బస్టాండ్లను ప్రయివేట్ వ్యక్తలకు, సంస్థలకు లీజు ప్రాతిపదికన కట్టబెట్టే చర్యలను ప్రతిఘటిస్తున్నామని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి శివ నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ బస్టాండ్లను లీజు పేరుతో 33 సంవత్సరాలు పాటు ప్రయివేట్‌కు అప్పగించాలనుకోవడం సరైంది కాదన్నారు. ఆర్‌టిసి సంస్థ నిర్వహణలోనూ, గ్యారేజ్‌ల ఏర్పాట్లలోనూ, బస్సుల కండిషన్ సమర్థవంతంగా ఉంచడంలోనూ కీలకమైన పాత్ర పోషిస్తుందన్నారు. అలాంటి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్‌టిసికి బస్టాండ్‌లను నిర్వహించడంలో ఇబ్బందులు ఏవి ఎదురయ్యే అవకాశం లేదని ఆయన అన్నారు. అనేక సంవత్సరాలుగా సంస్థ అభివృద్ధి సాధిస్తూ ముందుకు దూసుకోపోతుందని, ఇలాంటి పరిస్థితుల్లో నిర్వహణ పేరుతో ప్రయివేట్ సంస్థలకు కట్టబెట్టాలని ఆలోచించడం ఎంతవరకు సమంజ సమన్నారు. రాష్ట్రంలో మొదటిసారిగా మదనపల్లి ఆర్‌టిసిబస్టాండ్‌ను కాంట్రాక్‌కు అప్పజెప్పి చర్యలు ప్రారంభిస్తుందన్నారు. ఆ తర్వాత దీన్ని రాష్ట్రమంతా విస్తరించడానికి సిద్ధమవుతుందన్నారు. ముఖ్యమంత్రి, ఆర్‌టిసి చైర్మన్ ఇద్దరూ కడప జిల్లా వాసులేనని, వీరిద్దరూ లీజు పేరుతో బస్టాండ్ల ప్రయివేటీకరణను నిలుపుదల చేసేలా చూడాలని కోరారు. వ్యక్తులకు కట్టబెట్టే విధానాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే స్టేషన్లను ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెడుతోందని, ఆదిశగా రాష్ట్ర ప్రభుత్వం కూడా పయనిస్తోందని వాపోయారు. తక్షణమే ఇలాంటి విధానాలకు స్వస్తి చెప్పాలని, లేనిపక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజానీకాన్ని కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొండయ్య, శ్రీను పాల్గొన్నారు.

ప్రతిష్టకు భంగం కలిగించే పనిచేయను : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి

'నాపై విశ్వాసంతో అభిమానంతో రెండు సార్లు ఎమ్మెల్యే గెలిపించిన నా (ప్రొద్దుటూరు) నియోజకవర్గ ప్రజల ప్రతిష్టకు భంగం కలిగించే రీతిలో ఎప్పుడూ పనిచేయను' అని ఎమ్మెల్యే రాచ మల్లు ప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదారు దశాబ్దాలుగా ప్రొద్దుటూరులో నిర్వహించిన ఎన్నికలను ఇక్కడి ప్రజలు గమనిస్తూంటారు. గతంలో రాజకీయ ప్రత్యర్థులు హుందాగా ఆరోగ్యకరమైన పోటీతో గెలిచిన వారే, ఆదర్శవంతమైన రాజకీయాలు చేసిన వారే అన్నారు. కాని ప్రస్తుతం టిడిపి నాయకుల మాటలు చేస్తుంటే హుందాతనం కరువైందని వాపోయారు. పాదయాత్ర మెదలైనప్పటి నుంచి లోకేష్ మాటలు, రెండు రోజులుగా చంద్రబాబు మాటలు జుగుప్సను కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. మూడు ఏళ్లుగా స్థానిక టిడిపి నాయకులైతే దిగజారిపోయి చిల్లర మాటలు మాటా ్లడుతున్నారని అన్నారు. తాను అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడు తున్నానని అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. తన సచ్చీలతను కాపాడు కునేందుకే తనపై విచారణకు సిబిఐ ని ఆశ్రయించానన్నారు. తప్పు చేయని వ్యక్తి ఎవరికీ భయపడడు అన్నారు. స్థానిక టిడిపి నాయకులు ఎప్పుడైనా చిత్తశుద్ధితో ప్రజాసమస్యలపై పోరాడారా అని సూటిగా ప్రశ్నించారు. ఒక్క సమస్యల పైనైనా ఉద్యమించారా అన్నారు. సద్వి మర్శ చేశారా అని అడిగారు. నూతన బస్టా ండు, నూతన కూరగాయల మార్కెట్, వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల, మంచి నీటి పైప్‌లైన్, కాలువల ఆధునీకరణ ఇలా జరుగుతున్న అభివృద్ధి గురించి ప్రజల మేలుకోరి ఎప్పుడైనా మాట్లాడారా అన్నారు. మూడు సంవత్సరాలు వీరు మాట్లాడుతున్నది తనపై అసత్య ఆరోపణలే అన్నారు. తన ధర్మ సంపాదనలకు తన బిడ్డలతో పాటు నియోజకవర్గ బిడ్డలు కూడ వారసులే అన్నారు. ఇకమీద తనపై ఎలాంటి ఆరోపణలు ఉంటే ఆధారాలతో సహా సిబిఐకి ఇవ్వాలని రాజకీయ ప్రత్యర్థులను ఆయన కోరారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నీరాజనాలతో మరోమారు జగన్ ముఖ్యమంత్రి కాబోతున్నారని ఆయన జోస్యం చెప్పారు.

నల్ల తామర పురుగు పట్ల జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి - వేంపల్లె



మామిడి చెట్లకు ఉన్న పూతను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ ఎఒ రెడ్డయ్య

మామిడి తోటలకు సోకుతున్న నల్ల తామర పురుగులు పట్ల రైతులు జాగ్రత్త వహించాలని ఉద్యానవన శాఖ ఎఒ రెడ్డయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అలిరెడ్డిపల్లి లో సాగు చేసిన మామిడి తోటలను ఉద్యానవన అధికారులు పరిశీలించారు. మామిడి చెట్లుకు ఉన్న పూత, పిందె దిశలో వాటిని పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లకు ఉన్న పూతకు పైదశలో నల్లతామరను కొత్తగా గుర్తించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఉన్న పూతలకు నల్ల తామర పురుగు సోకినట్లు చెప్పారు. మిరప పంటకు ఆశించిన ఇండోనేషియా పురుగు ప్రస్తుతం మామిడి పైకి వచ్చిందని తెలిపారు. ఇండోనేషియా పురుగును నివారించేందుకు కాపు కాచే మామిడి చెట్లుకు పాదిలో ఒక్కొక చెట్టుకు 2.5 నుంచి 3 కిలోల వేప పిండి వేయాలని చెప్పారు. ఎకరాకు 30 నుంచి 50 నీలి రంగు జిగురు అట్టలు చెట్టు మార్చి చెట్టుకు పెట్టాలని అన్నారు. వేపనూనె 10 వేల పిపిఎను 1 లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని చెప్పారు. పూతపైన వివిధ దశలో ఉన్న లద్దే పురుగులను గుర్తించామన్నారు. వాటి నివారణకు ఎమోమెక్టివ్ బెంజోయోట్ 0.4 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. తేనె మంచు పురుగు ఉంటే థమోమిథాక్సామ్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని కోరారు. పిందెలు గోలికాయ నుండి నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు పదేళ్లు పైబడిన చెట్లకు రెండవ సారి ఎరువులు, ఒక కేజి యూరియా, 750 గ్రాముల పోటాషియం వేయాలని చెప్పారు. నీటి తడువులు 15 రోజులకు ఒకసారి ఇవ్వాలని చెప్పారు. డ్రిప్ ఉన్న వారు రోజూ 90 లీటర్ల నీటిని చెట్లకు ఇవ్వాలని చెప్పారు. అధికారులు సూచన మేరకు చెట్లకు సస్యరక్షణ చేపట్టితే తెగుళ్లు నుంచి బయట పడవచ్చని చెప్పారు. కాబట్టి మామిడి తోటలు సాగు చేసిన రైతులు తెగుళ్లు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దామని పురపాలక చైర్మన్ డాక్టర్ వల్లపు వరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సి.ఎం. వైస్ జగన్మోహన్ రెడ్డి పులివెందుల పురపాలకను మోడల్ టౌన్ తీర్చిదిద్దుతున్నారు. ఆయన ఆదర్శాలకు అనుగుణంగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సహకారంతో వైసిపి పులివెందుల మున్సిపల్ ఇన్‌ఛార్జి వై.ఎస్. మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల మూడు రోజులు కౌన్సిలర్‌తో కలిసి ఇండోర్ పర్యటనకు వెళ్లామన్నారు. నేరుకు అక్కడి ప్రజలు తడి పొడి చెత్త వేరు చేయు విధానంలో ఎన్నో కొత్త విధానంతో తయారు చేస్తారని తెలిపారు. అనేక ఉపకరణాలను తయారు చేయడంలో ఎంతో బాగుందని తెలిపారు. పుర ప్రజలు కూడా ఎక్కడ పడితే అక్కడ చెత్త వెయ్యకుండా బుట్టలనే వేసి మీ ఇంటి ముందుకు వచ్చే మునిసిపాలిటీ వానల్లో అందించాలని కోరారు. పులివెందుల పట్టణ అభివృద్ధిలో ప్రజల సహకారం ఎంతో ఉందని చెప్పారు. అందులో భాగంగానే మనకు స్వచ్ఛ సర్వేక్షన్ 2022 అవార్డు వచ్చిందని తెలిపారు. మరిన్ని అవార్డులు మనం తీసుకొచ్చే విధంగా ఒక ప్రణాళిక బద్ధంగా మనం ముందుకు వెళ్లాలని ఆయన కౌన్సిలర్‌కు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పురపాలక వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు, పార్నపల్లి కిషోర్, విజయ్ కుమార్ నాయుడు, ఖాదర్, అరగంట వేముల సుజాత, భార్గవి ఉన్నారు.

నేడు శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

చక్రాయిపేట : శివరాత్రి పర్వ దినం సందర్భంగా 18న చక్రాయపేటలోని శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ రాచరాయల స్వాముల వీరభద్ర దేవస్థానంలో శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, శివ పార్వతి స్వామిలకు కల్యా ణోత్సవం అంగరంగ వైభ వంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ఓబుల్‌రెడ్డి, కమిటీ సభ్యులు చక్రపాణిరెడ్డి, రామాంజనేయులురెడ్డి శుక్రవారం తెలిపారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ కల్యాణోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి రావాలని కోరారు. మల్ రెడ్డి మురళీధర్ రెడ్డి, అమరావతి దంపతులు అన్నదాన కార్యక్ర మం చేపట్టనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీ సాయి సంతోషి సురభి నాట్య మండలి కళాకారులతో శ్రీ సత్యహరిచంద్ర, మాయ బజారు నాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు. రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బండ లాగుడు పోటీలుంటాయని తెలిపారు. అనంతరం ఏడు గుర్రాల రథంపై స్వామి వారి ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని తెలిపారు. కల్యా ణోత్సవం నిర్వహణకు ఎంపీ వై.ఎస్ అవినాష్‌రెడ్డి సహకరించినట్లు చెప్పారు.

చదువులో వెనుకబడిన వారిని గుర్తించాలి

వేంపల్లె : చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి చదవడం, రాయడం నేర్పించాలని మానిటరింగ్ అధికారి చెరుకూరి శ్రీనివాసులు చెప్పారు. శుక్రవారం తాళ్లపల్లి జిల్లా పరిషత్ పాఠ శాలలో లిప్ అభ్యసనంపై ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచింగ్ పీరియడ్‌ను ప్రాక్టీస్ పీరియడ్‌లను రెండూ లిప్‌లో అంతర్భాగంగా ఉపాధ్యాయులు భావించాలి కోరారు. విద్యార్థులతో కీ వర్డ్స్, సిమిలర్ లైన్స్, సినాప్సిస్ వంటి వాటిని చదివించడం, రాయించడం అనేది నేర్పించాలని చెప్పారు. విద్యార్థులకు ప్రత్యేక బోధన అనేది ప్రాకిస్టు పిరియడ్ లో ఉపాధ్యాయులు నేర్పించాలని కోరారు.



వినతులు స్వీకరిస్తున్న ఎంపీ వై.ఎస్ అవినాష్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

ప్రజా సమస్యలను పరిష్కరించడమే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని కడప పార్లమెంటు సభ్యుడు వై.ఎస్. అవినాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ముఖ్యమంత్రి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజా ప్రతినిధులను ప్రజల ఇంటి వద్దకే పంపి వారి సమస్యలను ఎప్పటికీ ఎప్పుడూ పరిష్కరించేందుకు గడప గడప కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని జగనన్న ఆకాంక్ష అన్నారు. ప్రజల సమస్యలు సంబంధిత అధికారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించారు.

లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదు

జమ్మలమడుగు రూరల్ : డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని జమ్మలమడుగు ఎస్ఐ సుబ్బారావు అన్నారు. శుక్రవారం సాయంత్రం పెన్నా నది బ్రిడ్జి వద్ద వాహనాలు తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా ఎలాంటి వాహనమూ నడప రాదన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు ద్విచక్ర వాహనాలు కానీ, ట్రాక్ట ర్లు, కార్లు వంటివి తల్లిదండ్రులు ఇవ్వరాదన్నారు. ప్రమాదం జరిగి ఏమైనా అయితే జవాబుదారీ ఎవరని ప్రశ్నించారు. సరైన పత్రాలు లేని వారికి జరిమా నా విధించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు బాదుల్లా, సురేష్ పాల్గొన్నారు.

నేడు, రేపు సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల టౌన్ : మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని శని, ఆదివారాలలో పులివెందులలోని శిల్పారామంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శిల్పారామం ప్రత్యేక అధికారి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఫాతిమా మెడికల్ స్టోర్, పులివెందుల, పాలగిరి ప్రదీప్ సియోన్ పురం వారి సౌజన్యంతో మాస్టర్ టీ అధ్వర్యంలో అంకాలమ్మ మెమోరియల్ పాఠశాల , వేల్పుల చిన్నారులచే సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు అద్భుతమైన నృత్య ప్రదర్శన ఉంటుందని తెలిపారు. పులివెందుల పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని మార్కెట్ యార్డ్‌లో శనగల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం వ్యవసాయ సహాయ సంచాలకులు అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగల కొనుగోలుకు మార్క్‌ఫెడ్ సంస్థకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని చెప్పారు. క్వింటాకు రూ. 5335 కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సర్వతంరెడ్డి, పులివెందుల, లింగాల, వేముల మండలాల వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పవన్‌కుమార్ నామినేషన్

ప్రజాశక్తి- కడప అర్బన్



నామినేషన్ దాఖలు చేస్తున్న పవన్ కుమార్

అనంతపురంలోపశ్చిమరాయలసీమ (కడప, అనంతపురం, కర్నూల్ జిల్లాలు) పట్టభద్రుల శాసనమండలి ఎంఎల్‌సి ఎన్నికలకు మొదటి సెట్టు నామినేషన్‌ను స్వతంత్ర్య అభ్యర్థి పట్టుపోగుల పవన్‌కుమార్ శుక్రవారం వేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్ గార్గ్‌కు తన ఛాంబర్లో సమర్పించారు. కార్యక్రమంలో సిఆర్ఐ సునీల్, జయంత్, సురేష్, కార్తిక్, రవి తేజ యాదవ్ పాల్గొన్నారు.